


అది టైగర్ హిల్స్‌కి దగ్గరగా వున్న భారత సైనిక శిబిరం. మధ్యాహ్నం అయింది. మబ్బులవల్ల ఆకాశం మసగ్గా వుంది. అప్పుడే వచ్చిన ఓ హెలికాప్టర్ భోజనం, ఉత్తరాలు అందించి వెళ్ళింది.

''మేజర్ సూర్యతేజా'' కొంచెం గట్టిగా పిలిచారెవరో.

శత్రువు కదలిక కోసం తుపాకి ఎక్కుపెట్టి చూస్తున్న సూర్య – తల తిప్పకుండానే చేయి ఊపాడు.

ఉత్తరాన్ని వెనక్కు తిప్పి అరసెకను చూశాడు - అమ్మ.

మనసులో ఒక ఆనంద కెరటం.

ఇప్పుడా ఉత్తరాన్ని చదివే వ్యవధిలేదు. రెప్పపాటు కాలం కూడా తను అన్యమనస్కం కాకూడదు.

ఇక్కడ - ఈ శిబిరంలోని పదిహేను మంది వీర సైనికుల ప్రాణాలకు, కోట్లాది రూపాయల ఆయుధాలకు - ప్రస్తుతం తాను కాపలా.

అంతే. ఉత్తరాన్ని జేబులో పెట్టుకొని, రకరకాల ఆయుధాల్ని సిద్ధంగా పెట్టుకొని, చురకత్తుల్లాంటి చూపులతో - చుట్టూ చూస్తున్నాడు సూర్య.

ఎవరైనా వచ్చి అతని డ్యూటీ తీసుకుంటే తప్ప అతడు భోంచేయలేడు.

నిముష నిముషానికి పరిస్థితి ఉద్రిక్తమవుతోంది. ఉన్నట్టుండి పెద్ద పెద్ద ప్రేలుళ్ళ ధ్వనులు వినబడుతున్నయ్.

ఆ ఉత్తరాన్ని ఒక్కసారి తడుముకున్న సూర్య అమ్మ - ప్రేమతో తన తలమీద చెయ్యేసి దగ్గరకు లాక్కున్నట్టే ఫీలయ్యాడు.

ఏమనిపించిందో గాని ఒక్కసారి కుడివైపు కొంచెం ఎక్కి తిరిగి చూశాడు సూర్య.

అక్కడ నిర్మానుష్యంగా వుంది.

'ఓస్, ఇంతేకదా!' అనుకోబోయి, బైనాక్యులర్స్ తీసి మరింత నిశితంగా చూశాడు.

ఓ వంద గజాల దూరంలో, కొండ వాలులో రెండడుగుల ఎత్తున్న ఓ బండరాయి వెనుక నుండి - చెట్ల ఆకులు నిశ్శబ్దంగా నడిచి ముందుకు రాబోతున్నాయి.

అది శత్రువుకు సంబంధించిన టోపీ పైభాగం.

'మైగాడ్. వాడు ఇక్కడిదాకా ఎలా వచ్చాడు? వాడి టార్గెట్ తను కాదు. కొంచెం దూరంలో వున్న తమ శిబిరం!'

గుండె ఝల్లుమంది సూర్యకు.

మరుక్షణం తుపాకిని క్రిందపెట్టి శక్తివంతమైన గ్రెనేడ్‌ని చేతిలోకి తీసికొని గురిచూసి విసిరాడు.

భయంకరమైన విస్ఫోటనం. ఆ బండరాయి నూరు ముక్కలైంది. శత్రువు శరీరం నిర్జీవమై అల్లంత దూరాన పడింది.

శిబిరంలో ఆహారం తీసుకుంటున్న సహచరులు హడావుడిగా బయటికి వచ్చారు.

వింగ్ కమాండర్ - సూర్యని కళ్ళతోనే ప్రశ్నించాడు.

''వో దుష్మన్ మర్గయా సాబ్'' అన్నాడు సూర్య. అతని స్వరం నిండా ఉద్వేగమే.

తామున్న పరిస్థితికి, సూర్య చేసిన పనికి - అతను సూర్యను మనస్ఫూర్తిగా హృదయానికి హత్తుకున్నాడు.

ఇంచుమించు శిబిరంలోని వాళ్ళంతా అదే పని చేశారు.

అక్కడ భాషతో అవసరం లేదు.

సూర్య ఒక్క క్షణం వెనక్కు తిరిగి చూశాడు. కనుచూపు మేర - అనురాగ భరితయైన అఖండ భారతావని.

'ఈ విజయం అమ్మకు చెప్పాలి' మనసులో అనుకున్నాడు. చెప్పలేనంత సంతోషంగా వుంది మనసులో. శత్రువు మీద ఓ చిన్న విజయమే ఇంత హాయినిస్తుంటే - అసలు శత్రు శేషమే లేకుండా చేయగలిగితే .. ఓహ్... అదే కదూ ఆనందం అంటే!

సూర్యలో సమరోత్సాహం ఉరకలు వేస్తోంది.

ఎవరో అతని చేతిలోని ఆయుధాన్ని అందుకున్నారు.

సూర్య ఇప్పుడు భోజనం చెయ్యాలి.

ఆత్రంగా ఉత్తరాన్ని తెరిచాడు.

గుంటూరు,
25-6-99

పెద్ద తండ్రీ,

తాను పెద్ద కొడుకునని అమ్మ అలాగే పిలుస్తుంటుంది. సూర్య పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి. అతని మనసు అమ్మ అనురాగంతో నిండిపోయింది.

యుద్ధ భూమిలో ఉన్నానని, ఫలానా అడ్రస్‌కి వ్రాస్తే నాకు చేరుతుందనీ నువ్వు వ్రాసిన ఉత్తరం ఇప్పుడే అందింది.

నాన్నా, నా దొక్కటే సందేహం. ఇరవై ఐదేళ్ళ నీ వయస్సు శత్రువును ఎదుర్కోటానికి సరిపోతుందా?

నాకు నేను ఎంత ధైర్యం చెప్పుకుందామని చూస్తున్నా! ఈ గుండె లయతప్పుతోంది.


ఈ యుద్ధాలెందుకొస్తాయి నాన్నా, నా లాంటి తల్లుల గుండెల్ని పిండి చేయటానికి తప్పితే.

క్షణం క్షణం - శత్రువులు నీకేం అపకారం తలపెడుతున్నారో, ఏ తుపాకి గుండు నీ ప్రాణాలకోసం దూసుకొస్తుందో అనే భయం నన్ను బ్రతకనివ్వటం లేదు. పగవారికి కూడా ఈ పరిస్థితి రాకూడదు.

బాబూ, నిన్ను కన్నానే తప్ప నీ కోసం ఏమీ చేయలేని నిస్సహాయురాల్ని. మీ నాన్నగారు పోయినప్పటి నుండీ ఈ కుటుంబ భారాన్ని నీ లేత భుజాలపై ఎత్తుకున్నావు. నువ్వు నాకు కొడుకువే కాదు నాన్నా - నా

## 'తమ్ముడు' పవన్

'తమ్ముడు' పవన్ కళ్యాణ్ తాజా చిత్రం. ఎన్నో సన్నివేశాలు ఎంతో రిస్క్ తీసుకుని మరీ చేశాడు. హీరోయిన్‌గా ఇది తొలి తెలుగు చిత్రం ప్రీతి జింగానియాకి. రెండో హీరోయిన్ అదితికీ, దర్శకుడు అరుణ్ ప్రసాద్‌కీ తొలిచిత్రమే. 'తమ్ముడు' హిట్ గ్రేట్ వీరందరిదీ అంటున్నారు జనాలు.





### రూ.2,50,000 విలువైన బహుమతులు గెలుపొందండి

| | | |
|---|---|---|
| 5 | | |
| | 6 | |
| | | 7 |

| | | |
|---|---|---|
| 4 | 9 | 2 |
| 3 | 5 | 7 |
| 8 | 1 | 6 |

**ప్రత్యేక బహుమతి:**
హీరో హోండా మోటార్ సైకిల్ లేదా చేతక్ స్కూటర్ లేదా కలర్ టి.వి.
**కన్సోలేషన్ బహుమతులు:**
పరస్పర లాభం పథకం క్రింద
కెమెరా, టూ-ఇన్-వన్ ట్రాన్సిస్టర్, శారీస్, చేతి గడియారాలు.
ఉదాహరణలో చూపినట్లుగా కాంపిటీషన్ పోస్ట్‌కార్డ్/ ఎన్వలప్/ఇన్‌లాండ్ లెటర్ మీద 9 చదరాలు గీయండి మరియు 2 నుండి 10 వరకు గల అంకెలను ఉపయోగిస్తూ, అడ్డంగా, నిలువుగా మరియు ఏటవాలుగా ఎటుకూడినా మొత్తం 18 వచ్చేట్లు చూడండి. ఒక అంకె ఒకేసారి ఉపయోగించాలి. మీ ఎంట్రీలను ఆర్డినరీ మెయిల్ ద్వారా 10 రోజుల్లోగా పంపించండి. మొదట స్వీకరించిన 10 ఎంట్రీలకు టైటాన్ వాచ్ గోల్డెన్ చెయిన్ బహూకరించబడును.
**HERO ENTERPRISES (H-7)**
**VASUNDHARA, DELHI -110096**




కన్న తండ్రివి.

నీకు ఏ అపాయం కలగకూడదని ముక్కోటి దేవత లకు మొక్కుతూనే ఉన్నాను. అప్రమత్తంగా ఉండు నాన్నా. యుద్ధం చెయ్యొద్దనీ, వెనక్కు రమ్మనీ నేన నటం లేదు. కాని ఈ యుద్ధం నీ తల్లి గుండెను ఛిద్రం చేయకుండా చూడు. చెల్లీ, తమ్ముడూ - నడిచే బొమ్మ లైపోయారు. కాలేజీ కెళ్తున్నారు కానీ - నీకు తెలియం దేముంది? మా ముగ్గురి ప్రాణం చిరునామా నువ్వే కదా! ఈ యుద్ధమెప్పుడు ముగుస్తుందో! 'అమ్మా, నేనొచ్చేశాను' అంటూ నువ్వు నా కళ్ళ ముందు ఎప్పు డు ప్రత్యక్షమవుతావో! ఆ అమృత ఘడియలకోసం ఆతృతతో ఎదురు చూస్తున్నాను.

దేవుడు నిన్ను చల్లగా చూస్తాడు. నా ఆయుష్షు కూడా పోసుకొని నిండు నూరేళ్ళూ వర్ధిల్లు కన్నా.

ఉంటానూ,
ప్రేమతో, ఆశీస్సులతో,
అమ్మ

చెమ్మగిల్లిన కళ్ళతో, చిరునవ్వుతో ఆ ఉత్తరాన్ని ముద్దు పెట్టుకున్నాడు సూర్య.

వెంటనే పెన్నూ, కాగితం తీసి తల్లికి వ్రాయటం ఆరంభించాడు.

❀❀❀

రణభూమిలో గర్జించి నేలకొరిగిన వీరకిశోరం - మేజర్ సూర్యతేజ

పొద్దున్నే పేపర్ చూస్తూనే కుప్పకూలి పోయిందా తల్లి. సూర్య శౌర్యాన్ని ప్రస్తుతిస్తూ - సాహసాన్ని ప్రశం సిస్తూ - ప్రముఖుల ప్రశంసలు. కాని... ఆ దుఃఖం, ఆ గుండెకోత - పొగిలి పొగిలి ఏడుస్తున్న ఆ తల్లీ పిల్లల్నిచూసే వాళ్ళ కడుపు తరుక్కుపోతోంది. ఇరుగు పొరుగు, చుట్టాలు పక్కాలు అంతా వచ్చినా ఎవరు ఓదార్చగలరు? ఏమని చెప్పి ఓదార్చగలరు? ఆ ఇల్లు - దుఃఖానికి చిరునామా అయ్యింది.

నాల్గో రోజుకి ఇల్లు చేరిన సూర్య భౌతిక కాయానికి అధికార, అనధికారులు, పురప్రముఖులు - శ్రద్ధాం జలి ఘటిస్తున్నారు. అంత్యక్రియలకు ఏర్పాట్లు జరు గుతున్నాయి. ఎంత ఏడ్చినా తరగని కన్నీళ్ళు - ఆ తల్లి కళ్ళల్లో.

పోస్ట్‌మేన్ కన్నీళ్ళతో వచ్చి, సూర్య తల్లికొక ఉత్తరా న్నిచ్చి వెళ్ళాడు. అది సూర్య వ్రాసిందే.

కన్నీళ్ళ వల్ల అక్షరాలు అలుక్కు పోతున్నా, దుఃఖంతో ఎగిసిపడే హృదయాన్ని చిక్కపట్టుకొని ఎలా గో కవరు విప్పిందా తల్లి.

ప్రియాతి ప్రియమైన అమ్మా,

ఇప్పుడే నీ ఉత్తరం చేరింది. బాధపడకు. కొద్ది నిముషాల క్రితమే మా శిబిరానికి చేరువగా వచ్చిన శత్రువును భరతమాతకు బలి ఇచ్చాను.

అమ్మా, అసలు వీళ్ళకెన్ని గుండెలు? భారతీయు లంటే ఎంత చులకన భావం?! గతంలో ఎన్నిసార్లు మనం వీళ్ళకు బుద్ధి చెప్పలేదు! అయినా మళ్ళీ ఇలా... వీళ్ళ దురాలోచననీ, దురాగతాన్నీ చూస్తుంటే నా ఒంట్లోని రక్తం సలసలా మరుగుతోందమ్మా. అందుకే మా బెటాలియన్లో - నాది చిన్న వయస్సని అవకాశం ఇవ్వకపోయినా అర్థించి మరీ యుద్ధ భూమికి వచ్చాను.

మాతృభూమి రక్షణ యజ్ఞంలో సమిధలుగా మారటానికి దీక్ష పూనిన ధర్మ పుత్రులం ఈ దేశానికి కొల్లలుగా ఉన్నాం.

అమ్మా, మనం చేస్తోంది ధర్మయుద్ధం. కనుక అంతిమ విజయం మనదే. అందాకా నేనుంటే ఆ అపురూపమైన ఆనందాన్ని మీ అందరితోనూ పంచుకుంటాను.

ఒక వేళ నేను లేకుండాపోతే...

వద్దమ్మా. నీ కంట కన్నీరు ... వద్దు. వీరమాతవు. కన్నభూమి కోసం - కన్న కొడుకుని దానం చేసిన కన్న తల్లివి. నీకు, నీవంటి ప్రతి తల్లికీ - ఇదుగో నేను పాదాభివందనం చేస్తున్నాను.

అమ్మా, నాకు తెలుసు. నేను పోయాక కూడా నిన్ను నేనే ఓదార్చాలి. అది నా చివరి బాధ్యత.

అమ్మా, నీలాగే ప్రతి తల్లీ తన కొడుకును దేశ రక్షణకు పంపించాలి. ఇంతకంటే సార్థకం ఇంకేముం దమ్మా?!

అమ్మా, ఎల్లలులేని నీ ప్రేమను ఇంకా ఇంకా తనివి తీరా పొందాలని వుంది.

చెల్లిని, తమ్ముణ్ణీ బాగా చదివించు. తమ్ముడు సైన్యంలో చేరుతానంటే అడ్డు చెప్పకు - దీవించి పంపు.

చెల్లిని తలచుకుంటే మనసంతా మమకారంతో పులకించి పోతుంది.

ఆ మధ్య తను ''అన్నయ్యా, ఈ సెమిస్టర్‌లో నాదే ఫస్ట్ మార్క్'' అంటూ వ్రాసిన ఉత్తరానికి బదులిచ్చే వ్యవధి నాకు లేకపోయింది.

ఇంజనీరింగ్ చదివే నా చిన్నారి చెల్లిని గురించి ఆలోచిస్తే తను ఎక్కడ నడిచినా ఆ పాదాలు కందిపో కుండా నా అరచేతులుంచి కాపాడాలనిపిస్తుంది.

అమ్మా, చెల్లి ఎం.టెక్ చదువుతానంటే కూడా చదివించు. ఓ యోగ్యుడైన వరుణ్ణి చూచి పెళ్ళి చెయ్యి.

నాకు చాలా తృప్తిగా వుందమ్మా. నా కుటుంబా నికి, నా దేశానికి నేను చేయగలిగింది చేశాను.

అమ్మా, అమ్మా, అమ్మా, నా మనోగత భావాలను ఇలా నీకు వ్రాస్తూ పోతుంటే గంటలు నిముషాలై పోతా యి. అంత సమయం లేదు.

అమ్మా, నీ కంట కన్నీరు 'నేను తప్పుచేశానా!' అనే సందేహాన్ని కలిగిస్తుంది. నేను చేసింది తప్పు కానప్పుడు ఆ కన్నీరెందుకు?! వీరమాతగా ధైర్యంగా బ్రతుకమ్మా.

ఉంటానూ,
శతకోటి ప్రమాణాలతో,
నీ ప్రియ కుమారుడు,
సూర్య.

అక్కడున్న వారంతా ఊపిరి బిగబట్టి ఆమెనే చూస్తున్నారు. కన్నీళ్ళు తుడుచుకుంది. ఉత్తరాన్ని మడిచి జాగ్రత్తగా కవరులో పెట్టి, కళ్ళు కద్దుకొని - ముద్దు పెట్టుకుంది.

శవపేటికకు దగ్గరగా వెళ్ళింది.

''ఏడవను నాన్నా. నీ మాట ప్రకారమే ఇంక ఏడ వను. ఏడ్చి నిన్నవమానించను'' - స్థిరమైన స్వరంతో ప్రమాణం చేసింది.

(మూర్తీభవించిన మమతాను రాగమై - 1971 యుద్ధంలో విజయుడై - 26-9-98న అమరుడైన ''పెద్దన్నయ్య'' - కె.జె.పాదాలకు ఈ చిన్ని కథా సుమాన్ని - భక్తితో అర్పిస్తున్నాను) ★